# అమ్మా!... కాస్త అరువివ్వు తల్లీ!!...

వాళ్ళు ఆ ఇంట్లోకి కొత్తగా దిగారు. ఆ ఇంట్లోకి మారి రెండు రోజులైంది. ఈ రెండు రోజులూ ఇల్లు సర్దుకోవడంతో సరిపోయింది. ఇల్లంతా సర్దడం పూర్తయిన తరువాత ఒకసారి అన్ని గదులూ తాను ఎలా సర్దిందో చూస్కుని తృప్తిగా నిట్టూర్చింది అన్నపూర్ణ.

"ఇల్లు బాగుందండీ. ఇంక ఇరుగూపొరుగూ ఉన్నవాళ్ళు ఎలాంటి వాళ్ళో చూడాలి." అంది భర్త రాందాసుతో.

"మనం మంచిగా ఉంటే వాళ్ళూ మనతో మంచిగా ఉంటారు" అన్నాడు రాందాసు.

సరిగ్గా అదే సమయంలో వీధి తలుపు ఎవరో తట్టారు.

అన్నపూర్ణ వెళ్ళి తలుపు తీసింది.

గుమ్మం అవతల ఒకావిడ నిలబడివుంది. నుదుట పెద్ద కుంకుమ బొట్టుతో నలిగిన చీర. రేగిన జుట్టుతో....

అప్పుడే నిద్రలేచినట్టు ఉంది ఆమె మొహం చూస్తుంటే.

"ఎవరు కావాలండీ?" అని అడిగింది అన్నపూర్ణ ఆవిడని.

"నా పేరు జానకమ్మండీ. మీ ఇంటికి కుడివైపున ఉంటాను. మీరు ఈ ఇంటికి కొత్తగా వచ్చారని తెలిసి పరిచయం చేసుకుని పోదామని వచ్చాను." అంది ఆవిడ.

అన్నపూర్ణ సంబరపడిపోయింది. ఫరవాలేదు. ఇరుగూపొరుగూ మంచివాళ్ళలానే ఉన్నారు.

"రండి రండి" ఇంట్లోకి జానకమ్మని ఆహ్వానించింది.

"వారే మా ఆయన" రాందాసుని పరిచయం చేసింది.

"నమస్తే"

"నమస్తే. మీరు కూర్చోండి"అని లోపలి గదిలో కెళ్ళిపోయాడు రాందాసు.

"అన్నపూర్ణ, జానకమ్మ కాస్సేపు ఆ విషయం ఈవిషయం మాట్లాడుకున్నారు. ఒకరి కుటుంబం గురించి ఒకరు తెలుసుకున్నారు. అన్నపూర్ణ కాఫీ ఇస్తే జానకమ్మ తాగింది.

"ఇంక వస్తానండీ" అంటూ లేచింది జానకమ్మ.

"మంచిదండీ. అప్పుడప్పుడూ వస్తూండండి" అంది జానకమ్మతో పాటు తనూ లేస్తూ అన్నపూర్ణ.

గుమ్మందాకా వచ్చిన తరువాత జానకమ్మ హఠాత్తుగా కెవ్వున కేకేసింది.

ఆ కేకకి అన్నపూర్ణ జడుసుకుంది.

"అర్రెర్రెర్రెర్రె.... చూశారా? అసలు విషయమే మర్చిపోయాను. మా యింట్లో కాఫీపొడి నిండుకుందండీ. ఉదయం నిద్ర లేచిం తర్వాత కాఫీ పెట్టలేదు. నేను కాఫీపొడి తెస్తానని కాఫీ కాస్తానని ఇంటి దగ్గర అందరూ ఎదురు చూస్తూ ఉంటారు. ఓ గ్లాసుడు కాఫీపొడి అరువిస్తారా మళ్ళీ గుర్తుంటే ఇచ్చేస్తాను." అంది జానకమ్మ.

"దాందేం భాగ్యం. అలానే తీస్కెళ్ళండి" అంటూ అన్నపూర్ణ ఓ గ్లాసునిండా కాఫీపొడి తెచ్చి ఇచ్చింది.

పెళ్ళాలని రెండడుగులు ముందుకువేసి మరోసారి కెవ్వున అరిచింది జానకమ్మ.

"అర్రెర్రెర్రెర్రె.... చూశారా నా మతెలా మండిపోయిందో? కాఫీ పొడి ఉండగానే సరిపోయిందా? చక్కెర ఉండొద్దూ? మా ఇంట్లో చక్కెర కూడా నిండుకుందండీ" అంది జానకమ్మ.

"దాందేం భాగ్యం అలానే తీస్కెళ్ళండి" అంటూ గ్లాసుడు చక్కెర తెచ్చి ఇచ్చింది అన్నపూర్ణ.

ఈసారి రెండడుగులు వేసిన జానకమ్మ రైలు కూతలాగా గుండె లవిసిపోయేలా కెవ్వుమని అరిచింది.

అన్నపూర్ణ ఆ అరుపుకి తుళ్ళి పడింది.

"చూడండి ఇరుగుపొరుగు అన్నాక ఒకరికొకరు సాయంగా ఒకరి అవసరాలు మరొకరు తీర్చుకుంటూ ఉంటాం. మీరట్లా అరవకపోయినా నేను మీరడిగింది ఇస్తాను." అంది భయంభయంగా జానకమ్మ వంక చూస్తూ.

జానకమ్మ కాస్త సిగ్గుపడింది.

"సాంబారు చేద్దామంటే ఇంట్లో కందిపప్పు నిండుకుందండీ."

"దాందేం భాగ్యం. తీసికెళ్ళండి" అంది అన్నపూర్ణ గ్లాసునిండా కందిపప్పు పోసిఇస్తూ.


"జానకమ్మ వెళ్ళిపోయింది.

అన్నపూర్ణ వీధి తలుపు మూసి నాలుగడుగులు వేసిందోలేదో మళ్ళీ ఎవరో దబదబా తలుపులు బాదారు.

"అన్నపూర్ణ తలుపు తెరిచింది.

ఎదురుగా మరో ఆ.డ నిలబడి వుంది.

అన్నపూర్ణ ఆవిడవంక ప్రశ్నార్థకంగా చూసింది.




"నా పేరు పార్వతమ్మ అండీ. మీ ఇంటికి ఎడమ పక్కన ఉంటాను. మీరు కొత్తగా ఇక్కడికి వచ్చారనితెలిసి పరిచయం చేస్కుందామని వచ్చాను" అంది పార్వతమ్మ.

"రండి రండి." లోపలికి ఆహ్వానిస్తూ తనని తాను పరిచయం చేసుకుంది అన్నపూర్ణ.

ఇద్దరూ సోఫాలోకూర్చున్నారు అన్నపూర్ణా పార్వతమ్మా కాస్సేపు

ఆ విషయం ఈ విషయం మాట్లాడుకుని ఒకరి కుటుంబం గురించి మరొకరు తెల్సుకున్నాక పార్వతమ్మ లేచి నిలబడింది.

"ఇంక వస్తానండీ అన్నపూర్ణగారూ"

మంచిదండీ పార్వతమ్మగారూ అప్పుడప్పుడూ వస్తూండండి" అంది అన్నపూర్ణ తనూ లేచి నిలబడుతూ.

పార్వతమ్మ హఠాత్తుగా రెండు చేతుల్తో తప్పిట్లుకొట్టి "హ త్తెరికి అన్నట్లు మర్చిపోయానండీ. మా ఇంట్లో కాఫీ పొడి నిండుకుంది. కాస్త అరువిస్తారా?" అంది కళ్ళెగరవేసి అన్నపూర్ణవంక చూస్తూ.

"దాందేం భాగ్యం. అలాగే తీస్కెళ్ళండి" అంటూ లోపలికెళ్ళి ఒక గ్లాసుతో కాఫీపొడి తెచ్చింది అన్నపూర్ణ.

"పార్వతమ్మ రెండు చేతుల్తో తప్పట్లు కొట్టి నాలుక కొరుక్కుంది.

"హ త్తెరికీ. అసలు విషయం అడగడం మర్చిపోయాను. ఇందాక జానకమ్మ మీ ఇంటికి వచ్చింది కదూ? మీ ఇంటినుండి గ్లాసుల్తో ఏమేం తీస్కెళ్ళింది?"

ఆమె కూడా మీలాగా వచ్చి గ్లాసుడు కాఫీపొడి, గ్లాసుడు పంచదార, గ్లాసుడు కందిపప్పు అరువు తీస్కెళ్ళింది." చెప్పింది అన్నపూర్ణ.

వెంటనే పార్వతమ్మ మొహంలో రంగులు మారిపోయాయ్.

"కాపీపొడి వద్దులెండి. తీసోకోండి!" అంది కాపీపొడి తిరిగి ఇచ్చేస్తూ.

"అదేంటీ. కావాలని అన్నారుగా?" ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది అన్నపూర్ణ.

"అడిగేనే అనుకోండి. అయినా వద్దులే. ఎందుకులే అంది అలిగినట్టు మొహం పెట్టు పార్వతమ్మ.

"అదేంటండీ. మీరు కావాలని మళ్ళీ వద్దని అంటున్నారు. నేనేమైనా పొరబాటుగా ప్రవర్తించానా?"

"మీరు జానకమ్మగారికి గ్లాసుడు కాపీపొడి ఇచ్చారు. అవునా?" కళ్ళెగరేస్తూ కోపంగా అడిగింది పార్వతమ్మ.

అవునన్నట్టు తల ఊపింది అన్నపూర్ణ.

"మరి దానికీ గ్లాసుడు కాఫీపొడి ఇచ్చి నాకూ గ్లాసుడు కాఫీపొడే ఇస్తే ఎలా? దాని స్టేటస్ ఎక్కడ నా స్టేటస్ ఎక్కడ. మీరు మా ఇద్దర్నీ సమానం చేసేసి నన్ను ఇన్సల్టు చేసారు." అంది మొహం కందగడ్డలా పెట్టుకుంటూ పార్వతమ్మ.

అన్నపూర్ణ నాలుక కొరుక్కుని "అర్రెర్రె. సారీ అండీ." అని లోపలికి పరుగెత్తుకువెళ్ళి మరో గ్లాసుడు కాపీపొడి తెచ్చి ఇచ్చింది.

"ఏవండోయ్ బజారెళ్ళి కాపీపొడి తెండి. ఇంట్లో కాపీపొడి నిండుకుంది." అంటూ ఓసారి లోపలి గదిలోకి చూస్తూ అరిచింది అన్నపూర్ణ.

పార్వతమ్మ కదలకుండా ఇంకా అలానే నిల్చుని వుంది.

"ఏంటండీ. ఇంకా నిలబడే ఉన్నారేం? ఇంటికెళ్ళి కాపీ పెట్టొద్దా?" అంది అన్నపూర్ణ పార్వతమ్మతో.

పార్వతమ్మ మొహం జేవురించింది.

"ఇందాకేమో ఆ జానకమ్మనీ నన్నూ సమానం చేసేశారు. ఇప్పుడు దానికంటే తక్కువ చేసేసారు నన్ను."

అన్నపూర్ణ ఆశ్చర్యంగా చూసింది.

"అదేంటి? రెండు గ్లాసుల కాపీపొడి ఇచ్చానుగా?"

"మరి చెక్కెర, కందిపప్పు ఎవరిస్తారు?" పళ్ళు కొరికింది పార్వతమ్మ.

అన్నపూర్ణ చెంపలేసుక్కుని రెండుగ్లాసుల కందిపప్పు, రెండు గ్లాసుల చెక్కెర కూడా యిచ్చి పార్వతమ్మని పంపించింది.

ఆమె వెళ్ళిన కాసేపటికి ఒక అయిదేళ్ళ కుర్రాడు వచ్చాడు.

"ఏం బాబూ. ఎవరు నువ్వు. ఏంకావాలి?" అంటూ అన్నపూర్ణ బాబు బుగ్గల్ని చిదుముతూ ప్రశ్నించింది.

"నేను జానకమ్మ కొడుకునిలే. మీ ఇంట్లో చాక్లెట్లున్నాయా? ఓ నాలుగు అరువివ్వండి. మా నాన్నగారు కొన్నాక ఇచ్చేస్తా" అన్నాడు వాడు నడుంమీద చేతులు పెట్టుకుంటూ.

"అర్రెర్రే. మా ఇంట్లో చాక్లెట్లు లేవు బాబూ" అంది అన్నపూర్ణ.

"మీ ఇంట్లో చాక్లెట్లు లేవా! మరి మీ పిల్లలు ఏడిస్తే ఏమిస్తారు?"

"మాకు పిల్లలు లేరు బాబూ?"

"పిల్లలు లేరా? మీకు పెళ్ళయి ఎన్ని సంవత్సరాలైంది?"

అన్నపూర్ణ బిత్తరపోయింది.

మూడేళ్ళయింది బాబూ."

"ఎందుకైనా మంచిది మా అంకుల్‌ని డాక్టర్‌చేత పరీక్ష చేయించుకోమనండి. ఎక్కడ దొరికార్రా నాయనా. హు.." అనుకుంటూ వెళ్ళిపోయాడు వాడు.

సాయంత్రం మళ్ళీ జానకమ్మ వచ్చి "మా ఆయనకి పాయసం తినాలని ఉంది. కాస్త సేమ్యా, జీడిపప్పులూ, చెక్కర, యాలకులూ, పాలూ అరువిస్తారండీ." అంటూ వచ్చింది. ఆమె వెళ్ళాక పార్వతమ్మ ఇంకోదానికోసం వచ్చింది.

ఇలా రోజూ చుట్టుపక్కలవాళ్ళు అరువుకోసం వస్తూ అన్నపూర్ణని పీల్చుకుని తినేయసాగారు. నెల రోజులు కావాల్సిన సరుకులు వారాని ఖాళీ అయిపోయాయి. ఆ సమయంలో అన్నపూర్ణ తల్లి ఆండాళ్ళమ్మ గారు కూతురు కొత్త ఇల్లు ఎలాఉందో చూడ్డానికి వచ్చారు. అన్నపూర్ణ రోజూ జరుగుతున్న తతంగం తల్లితో చెప్పి భోరుమంది.

ఆండాళ్ళమ్మగారు ఆలోచించి ఒక చిట్కా కూతురికి చెప్పారు. అంతే.. అన్నపూర్ణ వెంటనే ఆ చిట్కాని అమలుపరిచింది. దాంతో ఆమె కష్టాలు గట్టెక్కాయి.

అన్నపూర్ణ ఏం చేసిందని అంటారా?

ఉదయం జానకమ్మ, పార్వతమ్మ లేవకముందే అలారం పెట్టుకుని తనే ముందు లేచి వాళ్ళింటికి వెళ్ళి కాఫిపొడి, చక్కెర వగైరాలు అరువు అడగడం మొదలు పెట్టింది .

అది మొదలు జానకమ్మ, పార్వతమ్మలు అన్నపూర్ణ ఇంటికి రావడం మానేశారు.